బెజ్జంకి : నూతన సంవత్సరం సందర్భంగా మండల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వర్గల్ : లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

సిద్దిపేటలోని తన ఇంటి ఎదుట నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముగ్గులు వేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

ఘనంగా న్యూఇయర్ వేడుకలు

సిద్దిపేట టౌన్ : కోటిలింగాల ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ప్రజలంతా ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి. 2023కు వీడ్కోలు పలుతుకూ.. 2024 నూతన సంవత్సరానికి ఘనస్వాగతం పలికారు. పట్టణాలు, గ్రామాల్లో అర్ధరాత్రి యువత కేక్‌లు కట్ చేసి న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లో రికార్డింగ్ పాటలతో యువత నృత్యం చేశారు. తమ బంధుమిత్రులకు ఫోన్లలో ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సోమవారం వేకువజామున నుంచే మహిళలు తమ ఇండ్ల ఎదుట రంగవల్లులు అద్దారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ప్రత్యేక ఆకర్షణగా రంగులతో కూడిన అందమైన ముగ్గులు వేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

- సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, జనవరి 1

నేడు అఖండ నామ సంకీర్తన

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 1 : ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో శతకోటి హరేరామ నామ జపయజ్ఞంలో భాగంగా నేడు(మంగళవారం) అఖండ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు పార్నంది ఆంజనేయశర్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు అఖండ నామ సంకీర్తన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భగవంతుడి కృపకుపాత్రులు కావాలని సూచించారు.

బురదలో పడి వ్యక్తి మృతి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి) జనవరి 1 : ప్రమాదవశాత్తు బురద పొలంలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం భూంపల్లి ఎస్సై భూవనేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్రమైన స్వామి (56) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం స్వామి తన పొలం వద్దకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. చీకటి పడినా స్వామి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కలత చెంది పొలం వద్దకు వెళ్లి వెతికారు. స్వామి తన పొలంలో ఒడ్డుపై నడుస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి బురదలో బొక్కబోర్ల పడి మృతి చెందాడు. మృతుడి కుమారుడు సిద్రమైన బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ములుగు, జనవరి 1 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వంటిమామిడిలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణానికి చెందిన పాషికంటి హరిప్రసాద్(30) మేడ్చల్ జిల్లా తుర్కపల్లిలోని బీఈ ఫార్మా ఇండస్ట్రీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం విధులకు వెళ్లిన హరిప్రసాద్ సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా రాజీవ్ రహదారిపై ములుగు మండలం వంటిమామిడి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో హరప్రసాద్ తీవ్ర గాయలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హుస్నాబాద్ అభివృద్ధిలో దూసుకెళ్లాలి

హుస్నాబాద్, జనవరి 1 : కొత్త సంవత్సరంలో హుస్నాబాద్ పట్టణం అభివృద్ధిలో దూసుకెళ్లాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ ఆకాంక్షించారు. సోమవారం హుస్నాబాద్‌లో స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు హాజరై నూతన సంవత్సర కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, జనగామ రత్నమాల, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, హెచ్ఎం బండారి మనీల, వివిధ సంఘాల నాయకులు చిట్టి గోపాల్‌రెడ్డి, చిత్తారి రవీందర్, గాదె పాక రవీందర్, కొత్తపల్లి అశోక్, వీరసోమయ్య, మోహన్‌రెడ్డి, వీరన్నయాదవ్, నోముల చంద్రారెడ్డి, సాంబమూర్తి, రామన్ బాబు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

న్యూఇయర్ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకన్న తదితరులు

భీమా కోరేగావ్ వీరులత్యాగం మరువలేనిది

హుస్నాబాద్ టౌన్ : భీమా కోరేగావ్ త్యాగాల దినోత్సవం సందర్భంగా నినాదాలు చేస్తున్న నాయకులు

హుస్నాబాద్ టౌన్, జనవరి 1 : భీమా కోరేగావ్ వీరుల త్యాగం మరువలేనిదని దళిత ప్రజా సంఘాల నాయకుడు కేడం లింగంమూర్తి అన్నారు. పీష్వాల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా మహార్లు చేసిన చారిత్రాత్మక పోరాట దినోత్సవాన్ని సోమవారం హుస్నాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా లింగంమూర్తి మాట్లాడుతూ బానిస సంకెళ్లు తెంచేందుకు మహార్‌వీరులు ప్రాణాలకు తెగించి పోరాటం చేశారని, వారి పోరాటం ఎందరికో స్ఫూరిదాయకమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఐక్యం కావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో దళిత, బహుజన సంఘాల నాయకులు జి.రవీందర్, ఎం.సంపత్‌కుమార్, ఎం.వీరన్నయాదవ్, కె.కొమురయ్య, వి.మల్లేశం, జి.శంకర్, కె.అశోక్, ఎం.సుధాకర్, వీరసోమయ్య, రాజు, యాదగిరి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

భీమా కోరేగావ్ స్మృతిలో...

గజ్వేల్, జనవరి 1: 'భీమా కోరేగావ్ స్మృతిలో' బానిసత్వంపై ఆత్మగౌరవ విజయోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, ఎం.కిష్టయ్య, ఎల్లయ్య, కృష్ణ, కుమార్, చందు, బాలయ్య, కృపానందం, నర్సింహులు, స్వామి, వేణు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో ముందుకు సాగాలి

తొగుట, జనవరి 1 : ప్రతిఒక్కరూ సత్ప్రవర్తన తో ముందుకు సాగాలని రంగంపేట రాంపూర్ పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతిస్వామీజీ సూచించారు. పీఠాధిపది శ్రీమాధసుధానంద సరస్వతిస్వామీజీతో కలిసి సోమవారం మండలంలోని రాంపూర్ మదనానంద సరస్వతి క్షేత్రం లో స్ఫటికలింగేశ్వరస్వామి 1100 లీటర్ల అవుపాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ ఈఎన్సీ సంజీవరావుతోపాటు ప్రముఖులు పాల్గొన్నారు.

రాంపూర్ స్ఫటికలింగేశ్వర విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాధవానంద సరస్వతిస్వామీజీ

విరాహత్ అలీని సన్మానిస్తున్న దేవీరవీందర్

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

గజ్వేల్, జనవరి 1 : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన విరాహత్ అలీని రాష్ట్ర ఎంపీటీసీ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విరాహత్ అలీని కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

అనాథలకు అండగా..

గజ్వేల్, జనవరి 1 : 'నాడు తండ్రి.. నేడు తల్లి అనారోగ్యంతో మృతి' పేరుతో ప్రచురితమైన వార్తకు లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ సభ్యులు స్పందించి చిన్నారులకు చేయూత నందించారు. మండల పరిధిలోని కొల్గూర్ గ్రామానికి చెందిన నీరుడి కవిత అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. కొద్ది రోజుల క్రితం తండ్రి భాస్కర్ మృతి చెందడంతో వారి ముగ్గురు పిల్లలు కావ్యశ్రీ, శ్రీవాణి, రిషిత్ అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వారు సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి క్వింటాల్ బియ్యం, నిత్యవసర సరుకులు, బ్లాంకెట్స్, స్వెటర్స్ అందజేశారు.

ఈనెల 4న ఆత్మీయ సమ్మేళనం

గజ్వేల్, జనవరి 1: ఈనెల 4న ప్రజ్ఞాపూర్‌లోని ఎస్ఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో సహస్రం శీర్షికతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు లోక్‌సత్తా తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహన్‌రావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ఆత్మీయ సమ్మేళనం ప్రారంభంకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణతోపాటు ప్రముఖులు హాజరవుతారని వివరించారు.

అయోధ్య రామయ్య అక్షింతల శోభాయాత్ర

దుబ్బాక, జనవరి 1 : అయోధ్యలో నిర్మించిన రామాలయంలో స్వామి వారి పూజిత అక్షింతలకు శోభాయాత్ర నిర్వహించారు. సోమవారం దుబ్బాక బాలాజీ ఆలయంలో అయోధ్య పూజిత అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రధాన వీధులగుండా స్వామివారి అక్షింతలకు శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్, కమిటీ సభ్యులు రొట్టే రాజమౌళి, చింత రాజు, భక్తులు పాల్గొన్నారు.

శబరిమలకు బయల్దేరిన అయ్యప్ప స్వాములు

గజ్వేల్ అర్బన్, జనవరి 1 : గజ్వేల్ నుంచి అయ్యప్ప స్వాములు శబరిమల అయ్యప్పస్వామి వారి దర్శనానికి సోమవారం సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బొగ్గుల సురేశ్ మాట్లాడుతూ గజ్వేల్ నుంచి శబరి అయ్యప్ప ఆలయం వరకు గతంలో అయ్యప్ప స్వాములు పాదయాత్రగా వెళ్లారని గుర్తుచేశారు. ఈసారి ఎర్రవాడ యాదగిరి, నంగునూరు నవీన్ స్వాములు గజ్వేల్ నుంచి శబరిమల వరకు సైకిల్ యాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూజారులు జితేందర్‌శర్మ, రాజేశ్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు ఆహ్వాన పత్రిక అందజేత

చేర్యాల, జనవరి 1 : మల్లన్న క్షేత్రంలో జనవరి 7న నిర్వహించే కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారి కల్యాణోత్సవానికి హాజరుకావాలని కోరుతూ సోమవారం ఆలయ ఈవో బాలాజీ ఆధ్వర్యంలో అర్చకులు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లు తదితర అంశాలపై మంత్రితో చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ స్థానాచార్యుడు మల్లేశం, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు ఉన్నారు.

మహిళా కార్మికులకు స్వెటర్లు పంపిణీ

సిద్దిపేట, జనవరి 1 : ఆరోగ్యంతోపాటు తోటి వారికి సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతామని ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె బాలకిషన్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట కోమటి చెరువుకట్టపై పనిచేస్తున్న మహిళా కార్మికులకు సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట కోమటి చెరువు కట్టను ఎప్పటికప్పుడు క్లీన్ అండ్ గ్రీన్ చేస్తూ పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న కార్మికుల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు యాదగిరిగౌడ్, దుర్గయ్య, రాజు, పద్మారెడ్డి, జైపాల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అంజయ్య, చంద్రం, మల్లేశం, శంకర్, రమేశ్, శ్రీను, ఆంజనేయులు, సతీశ్ పాల్గొన్నారు.